సంపుటి :02 సంచిక :296 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 03, ఫిబ్రవరి 2026

## 8న చెల్పూరులో సీఎం సభ

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




04

## శ్రీహరికి స్పీకర్ నోటీసులు

- అనర్హత వేటుపై రేపు విచారణ
- రేపటి విచారణపై ఉత్కంఠ

05



## సీఎం పర్యటనపై హై అలర్ట్

- కొడవటంచ ఆలయం, సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎస్పీ
- 8న భూపాలపల్లికి సీఎం రేవంత్

05




# ఇక అసలు పోరు

## పురపోరులో ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

తేలిపోయిన అభ్యర్థుల జాతకం.. ఉత్కంఠకు తెర

బీఫారాలు సమర్పించిన రాజకీయ పార్టీలు




05

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. దీంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు, డివిజన్ వారీగా అసలు బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరనే దానిపై పూర్తి స్పష్టత వచ్చింది. గత నెల 27న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. అభ్యర్థులు ఎవరనేది తేలిపోవడంతో అప్పడే స్థానికుల్లో అభ్యర్థుల గెలుపు ఓటమిపై చర్చ మొదలైంది.

– అక్షరదర్బార్, వరంగల్

- బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- ప్రతి మున్సిపాలిటీలో హోరెత్తనున్న ఎన్నికల ప్రచారం
- ప్రధాన పార్టీలకు 'రెబల్' సెగ.. బుజ్జగింపుల పర్వం
- ఉమ్మడి వరంగల్ లోని 12 మున్సిపాలిటీల్లో 260 వార్డులు

# లిఫ్ట్ ఇచ్చాడు.. కత్తి గుచ్చాడు!

## నల్గొండ హైవేపై మానవత్వంపై 'పోటు'


- కారు యజమాని ఇమ్రాన్‌పై ప్రాణాంతక దాడి
- చిట్యాల వద్ద దారుణం!
- నగదు, సెల్‌ఫోన్ కోసం దుండగుడి ఘాతుకం
- చావుబతుకుల మధ్య బాధితుడు

మానవత్వంతో సాయం చేయబోతే ప్రాణాల మీదకు తెచ్చిన విషాద ఘటన నల్గొండ జిల్లాలో కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తికి లిఫ్ట్ ఇచ్చిన పాపానికి, ఓ కారు యజమాని కత్తిపోట్లకు గురై రక్తపు మడుగులో పడిపోయాడు. నిందితుడు నగదు, సెల్‌ఫోన్ కోసం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది.

- అక్షరదర్బార్, నల్గొండ

05






# విషాదం

- ఎస్సారెస్పీ కాలువలో పడి ఇద్దరు వ్యాపారుల గల్లంతు!
- చెత్త పారబోయబోయి ప్రాణాల మీదికి.. గాలిస్తున్న పోలీసులు!

05




- పురపోరులో ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- తేలిపోయిన అభ్యర్థుల జాతకం.. ఉత్కంఠకు తెర
- బీ-ఫారాలు సమర్పించిన రాజకీయ పార్టీలు
- బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- ప్రతి మున్సిపాలిటీలో హోరెత్తనున్న ఎన్నికల ప్రచారం
- ప్రధాన పార్టీలకు 'రెబల్' సెగ.. బుజ్జగింపుల పర్వం
- ఉమ్మడి వరంగల్ లోని 12 మున్సిపాలిటీల్లో 260 వార్డులు

# ఇక అసలు పోరు

**అక్షరదర్బార్, వరంగల్ :**

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. దీంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు, డివిజన్ వారీగా అసలు బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరనే దానిపై పూర్తి స్పష్టత వచ్చింది. గత నెల 27న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. అభ్యర్థులు ఎవరనేది తేలిపోవడంతో అప్పుడే స్థానికుల్లో అభ్యర్థుల గెలుపు ఓటమిపై చర్చ మొదలైంది.

## - బీ-ఫారాలతో రంగంలోకి ప్రధాన పార్టీలు


నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజున కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలకు పదును పెట్టాయి. సర్వే నివేదికలు, సామాజిక సమీకరణాలు మరియు అభ్యర్థుల ఆర్థిక బలాన్ని బేరీజు వేసుకుని చివరకు తమ అధికారిక అభ్యర్థులకు బీ-ఫారాలను అందజేశాయి. మంగళవారం మధ్యాహ్నం తర్వాత పార్టీలు తమ తుది జాబితాలను విడుదల చేయడంతో, ఏ వార్డులో ఎవరి మధ్య పోటీ ఉండబోతుందో తేలిపోయింది.

## - తలనొప్పిగా 'రెబల్స్' సంస్కృతి

టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పెద్ద సవాలుగా మారారు. అనేక చోట్ల పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి స్వతంత్రులుగా బరిలో నిలిచిన వారిని బుజ్జగించేందుకు అగ్రనేతలు చివరి నిమిషం వరకు ప్రయత్నించారు. కొందరు వెనక్కి తగ్గినప్పటికీ, మరికొందరు మాత్రం "పార్టీ మాకు అన్యాయం చేసింది.. మా సత్తా ఏంటో చూపిస్తాం" అంటూ పంతంతో బరిలో ఉండిపోయారు. ఈ రెబల్ అభ్యర్థులు ప్రధాన పార్టీల ఓట్ల చీలికకు కారణమయ్యే అవకాశం ఉండటంతో అభ్యర్థుల్లో గుబులు మొదలైంది.

## - హోరెత్తనున్న ప్రచారం

అభ్యర్థుల ఖరారు కావడంతో పాటు ఎన్నికల అధికారులు గుర్తులను కూడా కేటాయించడంతో ఇక ప్రచార పర్వం ఊపందుకోనుంది. బుధవారం నుంచే అభ్యర్థులు పాదయాత్రలు, ఇంటింటి ప్రచారానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రధాన పార్టీల అగ్రనేతలు కూడా ఆయా మున్సిపాలిటీల్లో రోడ్ షోలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 మున్సిపాలిటీలకు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ 12 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 260 వార్డుల నుంచి అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగారు. ఫిబ్రవరి 11న జరగబోయే పోలింగ్‌లో ఓటరు నాడి ఎటువైపు ఉందో చూడాలి.




# నాగుర్లకు ఘన సన్మానం

## - బాణసంచా హోరులో డీలర్ల సంబరాలు

అక్షరదర్బార్, వరంగల్: తెలంగాణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ మరియు డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగుర్ల వెంకటేశ్వర్లు (నవత వెంకన్న)కు ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మొదటిసారి వరంగల్ చేరుకున్న సందర్భంగా డీలర్లు బాణసంచా కాల్చి, పూలవర్షం కురిపిస్తూ పండగ వాతావరణంలో ఆయనను ఆహ్వానించారు.

## - సమిష్టి కృషితోనే ఈ విజయం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. "గత 20 ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నాపై నమ్మకం ఉంచి, నన్ను ఇంటి మనిషిలా ఆదరించిన డీలర్లందరికీ రుణపడి ఉంటాను. ప్రతి డీలర్ సంక్షేమం, రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తాను. డీలర్ల సమిష్టి కృషితోనే ఈరోజు నేను రాష్ట్ర స్థాయి బాధ్యతలు చేపట్టగలిగాను" అని ఆయన పేర్కొన్నారు.

## - ముఖ్య నేతల సమక్షంలో సన్మానం

నవత వెంకన్నను అసోసియేషన్ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగరాజు పాల్గొన్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులు గాయత్రి రామచంద్రారెడ్డి, లాహోటి శ్రీనివాస్, అచ్చ పరమేశ్వర్, పోలిమెట్ల రమేష్ బాబు, పల్లె రాజేందర్ రెడ్డి, ఆకుల హరేందర్, దేసు ప్రవీణ్, బజ్జూరి సతీష్, అమ్మ జగన్ మరియు పెద్ద సంఖ్యలో ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల ఖరారు

- 30 వార్డుల జాబితాను విడుదల చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- సర్వేలు, నిబద్ధతే ప్రామాణికం.. సమన్వయంతో గెలుపు గుర్రాల ఎంపిక

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల సమరంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం) కూటమి తమ అభ్యర్థులను రంగంలోకి దించింది. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజు కుమార్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు కలిసి 30 వార్డుల అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు, నియోజకవర్గంలో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజల్లో మంచి ఆదరణ ఉండి, పార్టీ పట్ల విధేయత కలిగిన నాయకులకే అవకాశం కల్పించామన్నారు. అభ్యర్థులందరూ స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నవారని, గెలిచిన తర్వాత మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కన పెట్టి సమన్వయంతో అభ్యర్థుల విజయానికి కష్టపడాలని ఆయన పిలుపునిచ్చారు.

## - అభ్యర్థుల పూర్తి జాబితా

వార్డు వారీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 1 బౌతు శోభ – రాజేష్, 2 బుర్ర కొమురయ్య గౌడ్, 3 ఎరవెల్లి జగపతి (అరున్) రావు, 4 ముంజాల రవీందర్ గౌడ్, 5 గంగసరం శ్రీనివాస్ (సీపీఐ), ఉడుత సరోజన – రాయమల్లు( కాంగ్రెస్), 7 నూకల భూలక్ష్మి – చంద్రమౌళి (సీపీఐ), 8 సోతుకు రమ – సమ్మయ్య, 9 అప్పం కిషన్ యాదవ్, 10 పుల్లూరి మంజుల – మాధవ రావు, 11 గురిజాల రవి, 12 ముత్యాల శ్యాం గౌడ్, 13 బడితెల వెంకటస్వామి,14 మాకోటి శ్వేత – ప్రభాకర్, 15 అంబాల శ్రీనివాస్, 16 దాట్ల విజయ – శ్రీనివాస్, 17 బీర్రి కమల – మధునయ్య, 18 మూత సహదేవ్, 19 కురిమిల్ల శ్రీనివాస్, 20 ఇస్లావత్ రాజు నాయక్, 21 ధరావత్ శారద – సమ్మయ్య, 22 నమునురి ప్రేమలత – రాజబాబు, 23 శిరుప స్వప్న – అనిల్, 24 వేముల జ్యోతి – శ్రీకాంత్ (సీపీఐ), 25 పొనకంటి మేఘన – శ్రీనివాస్, 26 ఒరుగంటి రాధా – అయిలయ్య, 27 ఎర్రం అనుష – సతీష్ (సీపీఐ), 28 సోతుకు ప్రవీణ్ కుమార్ (సీపీఐ), 29 పుల్ల మహేష్, 30 బొడ్డు అశోక్.

# 'గులాబీ' హ్యాట్రిక్ ఖాయం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ధీమా
- బీసీలకే పెద్దపీట.. 52 శాతం టికెట్లు వారికే..

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీపై మూడోసారి గులాబీ జెండా ఎగురవేసి హ్యాట్రిక్ సాధిస్తామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి బండ ప్రకాష్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 వార్డుల అభ్యర్థులను ప్రకటించి, వారికి బీ-ఫారాలను అందజేశారు.

## - సెలెక్ట్ అండ్ ఎలెక్ట్

ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ బలహీన వర్గాల పక్షపాతి అని, అందుకే ఈ ఎన్నికల్లో 52 శాతం టికెట్లను బీసీలకే కేటాయించామని తెలిపారు. సర్వేలు, ప్రజాదరణ ఆధారంగా 'సెలెక్ట్ అండ్ ఎలెక్ట్' పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వివరించారు. టికెట్ ఆశించి దక్కని వారు అధైర్యపడొద్దని, భవిష్యత్తులో వారికి నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల్లో తగిన గౌరవం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలందరూ అంతర్గత విభేదాలు పక్కనపెట్టి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు కటకం జనార్దన్, బుర్ర రమేష్, మేకల సంపత్ కుమార్ యాదవ్, గండ్ర హరీష్ రెడ్డి, నూనె రాజు మరియు అభ్యర్థులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# భద్రకాళీ అమ్మవారి సన్నిధిలో అన్నా లెజ్నెవా

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సతీమణికి ఆలయ కమిటీ స్వాగతం

అక్షరదర్బార్, వరంగల్: ఓరుగల్లులో కొలువైన శక్తిపీఠం, చారిత్రక శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజ్నెవా సందర్శించారు. వరంగల్ పర్యటనలో భాగంగా ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ ధర్మకర్త శ్రీ తొనుపునూరి వీరన్న, అర్చక బృందం ఘన స్వాగతం పలికారు. ముందుగా దేవాలయ సంప్రదాయం ప్రకారం ఆమె ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధాన ఆలయంలో భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## - వేద ఆశీర్వచనం

దర్శనం అనంతరం ఆలయ స్నపన మండపంలో ముఖ్య అర్చకులు శ్రీ చెప్పెల వెంకటనాగరాజ శర్మ, వేద పండితులు ప్రదీప్ కుమార్ శర్మలు ఆమెకు వేద మంత్రాలతో 'మహదాశీర్వచనం' చేశారు. అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 'గులాబీ'లో టికెట్ల సెగ

- ఆశావాహుల ఆవేదన.. చల్లాకు బుజ్జగింపుల సవాల్!
- నిబద్ధతకు దక్కని గుర్తింపు? బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాతో ముదిరిన అసంతృప్తి
- పరకాల మున్సిపల్ పోరులో బీఆర్ఎస్ కు రెబల్స్ ముప్పు?
- డబ్బుకే ప్రాధాన్యత ఇచ్చారని పార్టీ జాబితాపై ఆశావాహుల విమర్శలు





అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల వేడి ఒక్కసారిగా పెరిగింది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించడమే ఆలస్యం.. పట్టణ రాజకీయాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. గత పదేళ్లుగా పార్టీ జెండా మోస్తూ, తమకే టికెట్ వస్తుందని గంపెడు ఆశలతో ప్రచారం చేసుకున్న పలువురు ఆశావాహులకు ఈ జాబితా షాక్ ఇచ్చింది.

### - డబ్బు, పరిచయాలకే పెద్దపీట?

వార్డుల్లో తమకు అనుకూలమైన రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, పార్టీ కోసం కష్టపడిన తమను కాదని, ఆర్థికంగా బలవంతులైన వారికి, ఉన్నత స్థాయి పరిచయాలు ఉన్నవారికి టికెట్లు కేటాయించారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. "పార్టీని నమ్ముకున్నందుకు మాకు దక్కిన బహుమతి ఇదేనా?" అంటూ కొందరు నేతలు తమ అనుచరుల ముందు భావోద్వేగానికి లోనవుతున్నారు.

### - చల్లాకు కత్తిమీద సాము

ప్రస్తుత పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఈ అసంతృప్తిని చల్లార్చడం పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు ఇంటింటి ప్రచారంతో జోరు పెంచాలని చూస్తున్నా, మరోవైపు సొంత పార్టీ నేతలే 'రెబల్స్'గా మారే అవకాశం ఉండటం పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. అసంతృప్త నేతలను బుజ్జగించి, వారిని ఎన్నికల బరి నుంచి తప్పించి పార్టీ గెలుపునకు సహకరించేలా చేయడంపైనే బీఆర్ఎస్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. టికెట్ దక్కని ఆశావాహులు పార్టీ అభ్యర్థుల కోసం పనిచేస్తారా? లేక స్వతంత్రులుగా బరిలోకి దిగి షాక్ ఇస్తారా? అన్నది వేచి చూడాలి.



## 22వ వార్డులో దూసుకుపోతున్న బీజేపీ

### మాజీ కౌన్సిలర్ భద్రయ్యకే జై కొడుతున్న వార్డు ప్రజలు

పరకాల పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 22వ వార్డులో భారతీయ జనతా పార్టీ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. బీజేపీ అభ్యర్థి, మాజీ కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య మంగళవారం వార్డులోని అయ్యప్ప నగర్‌లో ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ప్రతి ఓటరును కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. అయ్యప్ప నగర్ కాలనీవాసులు బీజేపీకే తమ ఓటు అంటూ భద్రయ్యకు హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా భద్రయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి, పరకాల పట్టణ బీజేపీ నాయకులు కక్కు రాజు, శివదత్తు, సిద్దు పాల్గొన్నారు.



## పాఠశాలలో ఉపసర్పంచ్ తనిఖీ

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల పంచాయతీ పరిధి వెంకట్రావుపల్లి (c) ప్రాథమిక పాఠశాలలో ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ తనిఖీ చేశారు. పాఠశాలలో సమస్యలు మౌలిక సదుపాయాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం పాఠశాల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా సహకరిస్తామని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జెట్టి కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్–బీజేపీలకు షాక్!

### 12, 14 వార్డుల్లో బీఆర్ఎస్ లో చేరికలు



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలను వీడుతూ 12వ, 14వ వార్డులకు చెందిన పలువురు కీలక నాయకులు మంగళవారం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో చేరారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగల పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని చేరికల సందర్భంగా నేతలు అభిప్రాయపడ్డారు.

### బీఆర్ఎస్ లో చేరిన వారిలో

మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎండి ఖాజా, ఎండి అబ్రార్, అలాగే ఏరుకొండ అవినాష్, బాలాజీ బ్రహ్మం, కనుగుల నరేష్, బోయిని గణేష్, దంచనాల హరీష్, బండి అభిలాష్, దంచనాల శ్రీకాంత్, బండ అరవింద్ (కన్ని) తదితర ప్రముఖ నాయకులు ఉన్నారు. 16వ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరుపున నామిషేన్ వేసిన కాంగ్రెస్ నాయకులు వీర్ల శంకర్ తో పాటు వీర్ల నిఖిల్ ఆ పార్టీకి రాజీనామా చేసి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పరకాల పట్టణంలో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బండి సారంగపాణి, రామకృష్ణ, జాకిర్ ఆలి, కొక్కిరాల రాకేష్ రావు, 12వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గంట కళావతి,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 13 నెలలుగా జీతాలు లేవు..!

### ఎస్సీడీడీ కార్మికుల ఆవేదన

### ఫిబ్రవరి 17లోపు వేతనాలు చెల్లించకపోతే పోరాటం

అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లాలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 13 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఈ విషయమై భారత కార్మిక సంఘం నాయకులు జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న కార్మికులు జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని,చట్టప్రకారం వారికి వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 17లోపు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల తరపున ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రావుల రంజిత్ ,అనిల్, చిలక మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలో అక్షరాభ్యాస కార్యక్రమం

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని మూడవ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ తౌటం లక్ష్మీ అంతయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. అంగన్వాడీ టీచర్లు భాగ్యమ్మ, అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మీ, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సన్మానించి, వారి చేతుల మీదుగా పిల్లలకు బాలామృతం, చిక్కి ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే ఇద్దరు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద, మహిళా శక్తి కోఆర్డినేటర్లు అనూష, మమత, అంగన్వాడీ టీచర్లు సుమారు 30 మంది, మహిళలు పాల్గొన్నారు.

## చిత్రలేఖన పోటీల్లో 'కాకతీయ' విద్యార్థిని ప్రతిభ



నర్సంపేట, అక్షర దర్బార్ : జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో నర్సంపేట కాకతీయ గ్రాడ్యుయేట్ జూనియర్ కళాశాల విద్యార్థిని రాగం శ్రీజ ప్రతిభను కనబర్చి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ప్రిన్సిపాల్ వీరమల్ల మాధవరెడ్డి మాట్లాడుతూ.. మారుమూల గ్రామమైన ఓటాయి నుంచి వచ్చి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏఓ వీరారెడ్డి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## 14వ వార్డులో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 14వ వార్డు ఎన్నికల ఇంచార్జి దుగ్యాల రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వార్డు ప్రజలను కలుసుకుని తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థి మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ కు మద్దతు తెలిపారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని 14 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.





# గండ్రవాడలో గులాబీల ఇంటింటి ప్రచారం

### 14వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి కొక్కిరాల దీప్తికి మద్ధతు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 14వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి కొక్కిరాల దీప్తి రాకేష్ రావు ప్రచారం జోరుగా కొనసాగుతోంది. మంగళవారం గండ్రవాడ, అయ్యగార్లవాడ ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఓటర్లను కలిశారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. తనకు అవకాశం ఇస్తే వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బ్రాహ్మణవాడలో పర్యటించిన సమయంలో అయ్యగార్లు "బిడ్డా.. మా ఓటు నీకే" అంటూ ఆశీర్వదించడంతో ప్రచారానికి మరింత ఉత్సాహం వచ్చింది. ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఎండీ జాకీర్ అలీ (ఎంపీపీ), నాయకులు పాడి నవతా భగవాన్ రెడ్డి, బండి వెంకటేష్, ఎండీ మాక్స్ ద్ అలీ, ఎండీ బియా బాని, జాలా రవీందర్ రెడ్డి, బొమ్మకంటి నాగరాజు, మాక్సూద్ అలీ, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.



# బాల్యవివాహాలను నిర్మూలించాలి

అక్షర దర్బార్, చిట్యాల: సమాజంలో జరుగుతున్న బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చురుకుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని జెండర్ స్పెషలిస్ట్ అనూష అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి ఆదేశాల మేరకు చిట్యాల మండల కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో బాల్యవివాహాలు, బాల కార్మికులు, బేటీ బచావో–బేటీ పడావో పథకం, ఆడపిల్లల విద్య, రక్షణ, బాలల హక్కులు, పోక్సో చట్టం, సోషల్ మీడియా ప్రతికూల ప్రభావాలు, మహిళల సమస్యలపై అవగాహన కల్పించారు. అలాగే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 14567, 112ల ఉపయోగంపై వివరించారు. అనంతరం బీబీబీపీ (బేటీ బచావో–బేటీ పడావో) ప్రతిజ్ఞ చేపట్టించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, బాలబాలికలు పాల్గొన్నారు.

# 12వ వార్డులో అజీజ్ ప్రచారం

అక్షరదర్బార్,మరిపెడ: మరిపెడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అజీజ్ చేపట్టిన ప్రచారం వార్డులో ఒక ప్రభంజనంలా సాగింది. 'ప్రజల మనిషి – వార్డు వారధి' అనే నినాదంతో ఆయన ఇంటింటికీ తిరుగుతూ జనంతో మమేకమవుతున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారం, మరియు రక్షిత మంచినీటి సరఫరాయే తన ప్రథమ ప్రాధాన్యతని అజీజ్ స్పష్టం చేశారు వార్డు ప్రగతి కోసమే నా ప్రయాణం. మీ ప్రతి ఓటు 12వ వార్డు రూపురేఖలను మారుస్తుంది. కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి, హస్తం గుర్తుపై ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొనారు.





# 8న చెల్పూరులో సీఎం సభ

### - ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



అక్షరదర్బార్, భూపాలపల్లి: ఈనెల 8న చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో(రామప్ప కాలనీ ఎదురుగా) సీఎం సభ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఎస్పీ సంకీర్త్ తో కలిసి 8వ తేదీన చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రామప్ప కాలనీ ఎదురుగా ఉన్న స్థలంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సంకీర్త్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా స్థలం, వీఐపీ గ్యాలరీ, ప్రజల కోసం ఏర్పాటు చేయనున్న గ్యాలరీ, పార్కింగ్, రహదారి సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, భద్రతా పరంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, ఆర్ అండ్ బీ ఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే పరకాల అభివృద్ధి

- డబ్బు సంచులతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచారం
- పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్



అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. మంగళవారం బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జ్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు డబ్బు సంచులతో తిరుగుతూ లిక్కర్, రియల్ఎస్టేట్ మాఫియాలుగా పరకాలను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పరకాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.



# రాజకీయాలను వ్యాపారంగా మార్చిన పాలక పార్టీలు

### ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

నర్సంపేట, అక్షర దర్బార్: ప్రజాసేవ కోసం ఏర్పడిన రాజకీయాలను పాలక పార్టీలు వ్యాపారంగా మార్చి లబ్ధి పొందడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. మంగళవారం నర్సంపేటలో నిర్వహించిన ఎంసిపిఐ(యు) డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలుపుకోసం ప్రలోభాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు పెరుగుతున్నప్పటికీ పాలకులు చిత్తశుద్ధితో స్పందించడంలేదని, దోపిడీ విధానాలతో ప్రజల కష్టాలను మరింత పెంచుతున్నారని అన్నారు. ప్రజల కనీస అవసరాల కోసం ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రజా సమస్యలను ఎజెండాగా చేసుకుని రాజకీయ విలువలను కాపాడేందుకు ఎంసిపిఐ(యు) కృషి చేస్తుందని, మున్సిపల్ ఎన్నికల్లో ఐదు వార్డుల్లో పోటీ చేస్తున్న తమ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు.



# 4వ వార్డులో కాంగ్రెస్ ముందంజ

### ఇంటింటా ప్రచారంలో ఏకు దివ్య–విద్యాసాగర్

అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణంలోని 4వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో కౌన్సిలర్గా పోటీ చేస్తున్న ఏకు దివ్య–విద్యాసాగర్ మంగళవారం వార్డు ఇంచార్జ్ బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించిన వారు, కాంగ్రెస్ గెలిస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. తనను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిపిస్తే ప్రజల సేవకుడిగా పని చేస్తానని ఏకు దివ్య–విద్యాసాగర్ ఓటర్లను కోరారు.

# కాంగ్రెస్‌లో చేరికలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 16 వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి పోరండ్ల కైలాసం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

### పార్టీలో చేరిన మైనారిటీ నాయకులు


పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు బిఆర్ఎస్ పార్టీకి చెందిన మైనారిటీ నాయకులు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం అని



పిలుపునిచ్చారు. పరకాల అభివృద్ధి దిశగా బీఆర్ఎస్, బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎండి సబీర్,ఎండి ఖదీర్,ఎండి ఇర్ఫాన్,ఎండి యాకూబ్,ఎండి సమీర్, సద్దాం, తయ్యబ్, వసీం ఉన్నారు.

# శ్రీహరికి స్పీకర్ నోటీసులు

- అనర్హత వేటుపై రేపు విచారణ
- రేపటి విచారణపై ఉత్కంఠ



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై విచారణ చేపట్టాలని స్పీకర్ నిర్ణయించారు. ఈ మేరకు రేపు బుధవారం ఉదయం 11 గంటలకు తన చాంబర్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

### - అసలు నేపథ్యం

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన కడియం శ్రీహరి, అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. పార్టీ మారిన కడియంపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ స్పీకర్ కార్యాలయంలో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేయకూడదన్న ఒత్తిడి ఉన్న నేపథ్యంలో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

### - ఇద్దరు నేతలకు పిలుపు

కేవలం కడియం శ్రీహరికి మాత్రమే కాకుండా, పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే కేపీ వివేకానందకు కూడా స్పీకర్ నోటీసులు పంపారు. రేపు ఉదయం జరిగే విచారణలో ఇరుపక్షాల వాదనలు వినను న్నారు. పిటిషనర్ తన వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాల్సి ఉండగా, కడియం శ్రీహరి తన వివరణను స్పీకర్‌కు అందజేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ తీసుకుంటున్న ఈ చర్య ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రేపటి విచారణ తర్వాత స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# సీఎం పర్యటనపై హై అలర్ట్

- కొడవటంచ ఆలయం, సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎస్పీ
- 8న భూపాలపల్లికి సీఎం రేవంత్



అక్షరదర్బార్, భూపాలపల్లి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 8వ తేదీన భూపాలపల్లి జిల్లాలో పర్యటించను న్నారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

### - కొడవటంచలో సీఎం పర్యటన

ముఖ్యమంత్రి తొలుత జిల్లాలోని ప్రసిద్ధ కొడవటంచ ఆలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ మరియు నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆలయ పరిసరాలను పరిశీలించి, సీఎం ల్యాండింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, కాన్వాయ్ రాకపోకలకు అనువైన రోడ్డు మార్గాలను తనిఖీ చేశారు.

### - సభా ప్రాంగణం - భద్రతా సమీక్ష

అనంతరం భూపాలపల్లి పట్టణంలోని మంజూరు నగర్‌లో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని ఎస్పీ సందర్శించారు. సభకు వచ్చే సామాన్య ప్రజలకు, వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

### - ఎస్పీ కీలక ఆదేశాలు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లాలో ఎక్కడా చిన్న పొరపాటుకు తావులేకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులకు సూచించారు. "ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలకు అసౌకర్యం కలగకూడదు, అదే సమయంలో భద్రతా పరంగా బ్లూ బుక్ నిబంధనలు పాటించాలి" అని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణలో జిల్లా స్థాయి పోలీస్ అధికారులు, రెవెన్యూ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ కాలువలో ఇద్దరు వ్యాపారుల గల్లంతు!

- చెత్త పారబోయబోయి ప్రాణాల మీదికి.. గాలిస్తున్న పోలీసులు!



అక్షరదర్బార్, హనుమకొండ : హనుమకొండలో పెను విషాదం చోటుచేసుకుంది. కాకతీయ యూనివర్సిటీ (కేయూ) సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో పడి ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. హైదరాబాద్ నుంచి వచ్చి ఇక్కడ పండ్ల వ్యాపారం చేసుకుంటున్న వీరిద్దరూ ప్రమాదవశాత్తు కాలువలో పడిపోవడం స్థానికంగా కలకలం రేపింది.

### - అసలేం జరిగిందంటే?

పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కాకతీయ యూనివర్సిటీ పరిసరాల్లో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తమ వద్ద ఉన్న చెత్తను పారబోసేందుకు వారు సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ కట్ట పైకి వెళ్లారు. ఈ క్రమంలో పట్టుతప్పి నీటి ప్రవాహంలో పడిపోయారు. ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వారిద్దరూ క్షణాల్లో గల్లంతయ్యారు.

### - కొనసాగుతున్న గాలింపు

సమాచారం అందుకున్న కేయూ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలో వారి కోసం వెతుకుతున్నారు. గల్లంతైన వారి వివరాలను సేకరిస్తున్న పోలీసులు, హైదరాబాద్‌లోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అజాగ్రత్తే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# ములుగు 20 వార్డులకు కాంగ్రెస్ అభ్యర్థులు

- బీ ఫారాలు అందజేసిన డీసీసీ అధ్యక్షుడు

అక్షరదర్బార్, ములుగు: ములుగు మున్సిపాలిటీలో ఎన్నికల నగారా మోగడంతో కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టింది. నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీలో పాగా వేయడమే లక్ష్యంగా, 20 వార్డులకు అభ్యర్థులను ఖరారు చేస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ మంగళవారం జాబితాను విడుదల చేశారు. సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని గెలుపు గుర్రాలకే అవకాశం కల్పించామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు పార్టీ తరపున బీ–ఫారాలను అందజేశారు.

### - కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా

వార్డు వారీగా వరుసగా 1 అలోత్ పద్మ దేవ్ సింగ్, 2 బూజుగుండ్ల మొగిలి, 3 యాసం వసంత రవికుమార్, 4 గుంటోజు పావని నిరంజన్, 5 గుగ్గిళ్ల దివ్య సుజన్, 6 చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, 7 వంగ సుమలత రవి యాదవ్, 8 నల్లెల్ల స్వాతి భరత్ కుమార్, 9 వేల్పుల శ్రావణి భరత్ రావు, 10 గజ్జెల సుస్మిత, 11 కేశెట్టి నవీన్, 12 కెక్కెర్ల అశోక్ గౌడ్, 13 చిలువేరు సాంబయ్య, 14 షాహిన్ మీర్జా, 15 బందారు నిర్మల హరినాథం, 16 ఎండీ కుతుబుద్దిన్, 17 ఇమ్మడి రాజు యాదవ్, 18 జక్కుల కోమల (రేవంత్ యాదవ్), 19 పొదాల ఓంప్రకాష్, 20 హట్కార్ ప్రశాంత్.

### - ఊపందుకోనున్న ప్రచారం

ఈ జాబితా ప్రకటనతో ములుగులో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో, మున్సిపాలిటీపై పట్టు సాధించడం కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది.

# వర్ధన్నపేట కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా

- 12 వార్డులకు ప్రకటించిన ఎమ్మెల్యే నాగరాజు

అక్షరదర్బార్, వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల సమరం ముదురుతోంది. కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థుల జాబితాను అధికారికంగా వెల్లడించింది. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంగళవారం 12 వార్డులకు సంబంధించి పార్టీ బలపరిచిన అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని, తప్పకుండా గెలిచే సత్తా ఉన్న నేతలకే అవకాశం కల్పించామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

### - వార్డుల వారీగా కాంగ్రెస్ అభ్యర్థులు

1వ వార్డు బెజ్జం పాపరావు, 2వ వార్డు భూక్యా ప్రమీల – బాబులాల్ , 3వ వార్డు మొహమ్మద్ అఫ్సర్, 4వ వార్డు సునావత్ కమిలి – భీమా నాయక్, 5వ వార్డు భూక్యా ప్రవంతి – నరేష్ నాయక్, 6వ వార్డు మలోతు దేవేందర్, 7వ వార్డు భుక్య శ్రీలత – రాము, 8వ వార్డు పాలకుర్తి సారంగపాణి, 9వ వార్డు మంచాల లత – రామకృష్ణ, 10వ వార్డు కొండేటి రజిత – సాంబయ్య, 11వ వార్డు ఈగ దామోదర్, 12వ వార్డు తిరుపెల్లి వాణి – కుమారస్వామి

### - విజయమే లక్ష్యంగా ప్రచారం

అభ్యర్థుల ప్రకటన అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేసి 12 వార్డుల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

# లిఫ్ట్ ఇచ్చాడు.. కత్తి గుచ్చాడు!

- నల్గొండ హైవేపై మానవత్వంపై 'పోటు'
- కారు యజమాని ఇమ్రాన్ పై దాడి
- చిట్యాల వద్ద దారుణం!
- నగదు, సెల్ ఫోన్ కోసం దుండగుడి ఘాతుకం
- చావుబతుకుల మధ్య బాధితుడు



అక్షరదర్బార్, నల్గొండ : మానవత్వంతో సాయం చేయబోతే ప్రాణాల మీదకు తెచ్చిన విషాద ఘటన నల్గొండ జిల్లాలో కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తికి లిఫ్ట్ ఇచ్చిన పాపానికి, ఓ కారు యజమాని కత్తిపోట్లకు గురై రక్తపు మడుగులో పడిపోయాడు. నిందితుడు నగదు, సెల్‌ఫోన్ కోసం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది.

### - అసలేం జరిగింది?

నల్గొండకు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి తన వ్యక్తిగత పని మీద కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి వద్ద ఓ వ్యక్తి లిఫ్ట్ అడగడంతో, ఇమ్రాన్ మానవతా దృక్పథంతో అతడిని కారులో ఎక్కించుకున్నారు. అయితే, కారు చిట్యాల సమీపానికి చేరుకోగానే వెనుక కూర్చున్న ఆ వ్యక్తి తన అసలు రూపాన్ని బయటపెట్టాడు.

### - విచక్షణారహితంగా దాడి

కారులో ఉండగానే అకస్మాత్తుగా ఇమ్రాన్ మెడపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇమ్రాన్ కారు ఆపి ప్రతిఘటించడంతో, భయపడిన దుండగుడు ఇమ్రాన్ వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేసి విఫలమై అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న ఇమ్రాన్‌ను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

### - పోలీసుల గాలింపు

సమాచారం అందుకున్న చిట్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హైవేపై ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుడి కోసం గాలిస్తున్నారు. "జాతీయ రహదారులపై వెళ్లేటప్పుడు అపరిచితులకు లిఫ్ట్ ఇచ్చి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు" అని పోలీసులు వాహనదారులను హెచ్చరిస్తున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915